క్లుప్తంగా

110 మందికి వైద్య పరీక్షలు



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆరిలోవ: చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో శుక్రవారం మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మహా శివరాత్రి సందర్భంగా ఆలయ ఆవరణలో ఉన్న శివలింగానికి భక్తులు పూజలు చేశారు. అనంతరం భక్తులకు ఇక్కడ ఉచిత వైద్య శిబిరంలో వైద్యులు బీపీ, మధుమేహం, ఈసీజీ తదితర పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్ రాహుల్ బృందం 110 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చీఫ్ ట్రస్టీ వానపల్లి అప్పారావు, కార్యదర్శి ఆర్.ఎ.పాత్రో, తదితరులు పాల్గొన్నారు.

అటవీ శాఖ అధికారుల తీరుపై నిరసన



జోడుగుళ్లపాలెం వద్ద రోడ్డుపై ప్లకార్డులతో రాస్తారోకో చేస్తున్న ధార్మిక సంఘాల ప్రతినిధులు

ఆరిలోవ: జోడుగుళ్లపాలెం సమీప నాగక్షేత్రంలో మహాశివ రాత్రి ఏర్పాట్లను గురువారం అటవీశాఖ అధికారులు అడ్డుకోవడంపై ధార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఆలయం ఎదుట రోడ్డుపై పలువురు ధార్మిక సంఘాల ప్రతినిధులు బైఠాయించి నిరసన తెలిపారు. అటవీ శాఖ అధికారుల దౌర్జన్యం నశించాలంటూ ప్లకార్డులతో రాస్తారోకో చేపట్టారు. దీంతో వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ధార్మిక సెల్ కో కన్వీనర్ విజయ్ ఫణి, విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర మందిర్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళల ప్రతిభ



కేక్ కట్ చేస్తున్న రోషిణి అపరంజి కోరాటి

విశాఖ సిటీ: మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభ చూపించగలరని విశాఖపట్నం స్పెషల్ ఎకనామిక్ జోన్ జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్ రోషిణి అపరంజి కోరాటి అన్నారు. పోలీస్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె కేక్ కట్ చేసి మాట్లాడారు. విధుల్లో ప్రతిభ కనబరిచిన మహిళలను గుర్తించి సత్కరించడం స్ఫూర్తిదాయకమన్నారు. 'ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం-పోలీస్ శాఖ కుటుంబ సలహా నివేదిక', 'ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం-పోలీసు శాఖ ఫ్యామిలీ కౌన్సెలింగ్‌కు హాజరుకు నోటీసు'అనే పుస్తకాలను విడుదల చేశారు. సీపీ ఎ.రవిశంకర్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు గొప్పగా రాణిస్తున్నారని, మహిళలకు ఓర్పు, సహనం ఎక్కువని తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వైజాగ్ సిటీ పోలీస్ మహిళా కో-ఆపరేటివ్ సొసైటీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీస్‌శాఖలో ప్రతిభ కనబరిచిన 26 మంది మహిళా పోలీసులకు సన్మానించి అవార్డు, ప్రశంసాపత్రాలు అందజేశారు. జాయింట్ సీపీ కె.ఫకీరప్ప, డీసీపీ-1 వి.ఎన్.మణికంఠ చందోలు, డీసీపీ(క్రైం) పి.వెంకటరత్నం, ప్రాసిక్యూషన్స్ డీడీ ఎం.శైలజ, ఏడీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

సెలవు రోజున స్కూళ్ల నిర్వహణపై ఆగ్రహం

విశాఖ విద్య: శివరాత్రి పర్వదినం సందర్భంగా పాఠశాలలకు సెలవు ప్రకటించినా.. నగరంలోని కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు నిర్వహించడాన్ని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహించిన పాఠశాలల వివరాలను అందజేయాలని కమిషన్ సభ్యుడు డాక్టర్ గొండు సీతారాం విద్యా శాఖాధికారులను ఆదేశించారు.

శివోహం..!



వర్సిటీ అవుట్ గేట్ సమీప రామాలయంలోని శివునికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

- ఘనంగా మహాశివరాత్రి వేడుకలు
- భక్తులతో కిటకిటలాడిన శైవ క్షేత్రాలు



పెదగదిలి శివాలయంలో స్వామి పూజలో భక్తులు



పెదగదిలి శివాలయంలో పూజలు చేస్తున్న మేయర్ హరి వెంకటకుమారి దంపతులు



సాగర లింగేశ్వరుడి సన్నిధిలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, తదితరులు



ఆరిలోవ కాలనీ శివాజీనగర్ శివాలయంలో శివలింగానికి అభిషేకాలు చేస్తున్న భక్తులు



పెదవాల్తేరులో మృత్తిక శివలింగానికి అభిషేకం చేస్తున్న డాక్టర్ సునీల్ కుమార్



వర్సిటీ అవుట్ గేట్ సమీప లలితా పీఠంలో బిల్వార్చనలో పాల్గొన్న భక్తులు



భక్తులతో కిటకిటలాడుతున్న పార్వతీముక్తేశ్వర ఆలయం

ఆరిలోవ: శివ నామ స్మరణతో శైవ క్షేత్రాలు మార్మోగాయి. మహా శివరాత్రి సందర్భంగా తూర్పు నియోజకవర్గంలో శుక్రవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. 9వ వార్డు విశాలాక్షినగర్‌లో కైలాసనాథుని ఆలయం, జోడుగుళ్లపాలెంలో నాగక్షేత్రం, హనుమంతవాక శివాలయం, 10వ వార్డులో రవీంద్రనగర్, ఆదర్శనగర్, 11వ వార్డులో డ్రైవర్స్ కాలనీ, కైలాసనగర్, 12వ వార్డులో పెదగదిలి, నెహ్రూనగర్, 13వ వార్డులో ఆరిలోవ కాలనీ ఆఖరి బస్ స్టాప్ వద్ద, శివాజీనగర్-2లో ఉన్న శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు. జీవీఎంసీ 12వ వార్డు కైలాసనగర్‌లోని శివాలయాన్ని మేయర్ గొలగాని హరివెంకటకుమారి దంపతులు, కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, తదితరులు దర్శించుకున్నారు. 13వ వార్డులో శివాజీనగర్‌లో కార్పొరేటర్ కెల్ల సునీత దంపతులు శివుడికి పూజలు చేశారు.

ఏయూ క్యాంపస్: వర్సిటీ అవుట్ గేట్ సమీపంలోని లలితా పీఠంలో ఉదయం రుద్రాభిషేకం, బిల్వార్చన భక్తుల సమక్షంలో నిర్వహించారు. అనంతరం లలితా దేవికి మహిళలతో కుంకుమార్చన జరిపారు. రామాలయంలోని పరమేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఈస్ట్ షిర్డీ ఆలయం సముదాయంలోని ఈశ్వరాలయం భక్తులతో కిటకిటలాడింది. అసంగానంద ఆశ్రమంలోని శ్రీమృత్యుంజయేశ్వర ఆలయంలో ఉదయం పంచామృత అభిషేకాలు, సాయంత్రం పంచనదీ జలాలలో అభిషేకం చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. లింగోద్భవ కాలంలో భక్తులతో స్వయంగా క్షీరాభిషేకం, సహస్రనామార్చన, రుద్రాభిషేకం జరిపారు. లాసన్స్‌బే కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయ సముదాయంలోని శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో సామూహిక రుద్రాభిషేకాలతో పాటు ప్రత్యేక శివ హారతి నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

మృత్తిక శివలింగానికి రుద్రాభిషేకం

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరు సీలాపు వారి వీధిలో విష్ణుమూర్తి గురు భవాని బృందం ఆధ్వర్యంలో మృత్తిక శివలింగాన్ని ప్రతిష్ఠించారు. ప్రభుత్వ ఛాతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.సునీల్‌కుమార్ అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమలో రూపాకుల విజయ్‌కుమార్, గేదెల నాగరాజు, విష్ణుమూర్తి, ఇల్లపు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీలోని పలు దేవాలయాల్లో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. సెక్టార్-6లోని శ్రీసిద్ధివినాయక పార్వతి ముక్తేశ్వరాలయంలో ఉదయం 5 గంటల నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. సెక్టార్-9లో శివాలయంలో కాలనీవాసులు భారీగా పాల్గొని మహాదేవుడికి అభిషేకాలు, పూజలు చేశారు. సెక్టార్-4లోని నవగ్రహ దేవాలయంలో కాలనీ వాసులు కుటుంబ సమేతంగా పాల్గొని వైకుంఠనాథుడ్ని దర్శించుకున్నారు.

సాగర లింగేశ్వరుడికి పూజలు

ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అప్పుఘర్ తీరంలో సాగర లింగేశ్వరుడికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయన్ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచందర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



హనీ గ్రూప్‌లో మహిళా దినోత్సవంలో పాల్గొన్న సిబ్బంది



అపోలోలో మహిళా దినోత్సవాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న పోక్సో జడ్జి ఆనంది



జాలరిపేటలో మేజిక్ బస్ ఎన్జీవో ఆధ్వర్యంలో మహిళ దినోత్సవంలో పాల్గొన్న మహిళలు

మద్దిలపాలెం : నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం శివాజీపాలెంలో ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు పాల్గొన్ని ఉత్తమ మహిళా ఉద్యోగినులను సత్కరించారు. దిశ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరి మాట్లాడుతూ మహిళా చట్టాలు, వారి రక్షణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల గురించి వివరించారు. ఎన్ఎంయూఏ ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు మహిళా ఉద్యోగుల హక్కులు, ప్రభుత్వం కల్పించిన రాయితీలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిస్పెన్సరీ సీనియర్ మెడికల్ అధికారి వాణి నీలిమా, జిల్లా కోర్టు అడ్వయిజరీ అక్టివిస్ట్ కళావతి, అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి పి.వి.వి.మోహన్, విజయనగరం జోనల్ కార్యదర్శి ఎం.వి.ఆర్.మూర్తి, రీజనల్ కార్యదర్శి బి.నీలకంఠం, కె.ఎస్.ఎన్.మూర్తి, ఏకే శివాజీ, వీఎస్ఆర్ మూర్తి పాల్గొన్నారు.

హనీ గ్రూప్‌లో..

విశాఖ సిటీ: రియల్ ఎస్టేట్ సంస్థ హనీ గ్రూప్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. సంస్థ ప్రారంభం నుంచి విజయానికి సహకారం అందించిన మహిళా సిబ్బందిని సంస్థ అధినేత ముక్క ఓబుల్ రెడ్డి, డైరెక్టర్ ముక్క శ్రీలత సన్మానించారు. ఈ సందర్భంగా అధినేత మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు సాధికారత దిశగా పయనిస్తున్నారని తెలిపారు. తమ కంపెనీలో 50 శాతం మహిళలే ఉన్నారని, సంస్థ విజయంలో వారి పాత్ర కీలకమని తెలిపారు. ఈ సందర్భంగా సంస్థలో పని చేసే మహిళలకు వెండి బహుమతులు అందజేశారు. పలు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

ఆరిలోవ: మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని పోక్సో న్యాయమూర్తి జి.ఆనంది తెలిపారు. హెల్త్‌సిటీ అపోలో ఆస్పత్రిలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరింత ఉన్నత స్థాయికి మహిళలు ఎదగాలి కోరుకుంటున్నానన్నారు. ఈ సందర్భంగా అపోలోలో మహిళల కోసం ప్రత్యేక ప్రో హెల్త్ ప్యాకేజీకి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ శశిప్రభ, వైభవ జ్యూయలర్స్ అధినేత మల్లిక రత్నకుమారి, విశాఖ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్, జిల్లా క్రీడా అధికారి జూన్ గల్లియోట్ రోడ్రిగ్స్, జీతో సంస్థ అధినేత్రి ప్రేరణ బైద్, ఆరేజే షర్మిల, వైజాగ్ మ్యాగజైన్ అధినేత్రి శిల్పాంజని దంతు, ప్రముఖ సంఘ సేవకురాలు షహనాజ్, ఆస్పత్రి మహిళా వైద్యులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన పెంచుకోవాలి

ఎంవీపీ కాలనీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జాలరిపేటలో మేజిక్ బస్ ఎన్జీవో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేడుకలు శుక్రవారం కూడా కొనసాగాయి. రెండు రోజులుగా జరుగుతున్న ఈ వేడుకల్లో భాగంగా మహిళల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళా పోలీసు రేవతి మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా రాణిస్తున్నారన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలపై మహిళలు మరింత అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వాంతన ఫౌండేషన్ డైరెక్టర్ పనిగ్రేసి, మ్యాజిక్ బస్ ఎన్జీవో ట్రైనింగ్స్ మానిటరింగ్ ఆఫీసర్ నరేంద్ర, శంకర్, పైడి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి 1200 మంది మత్స్యకారులు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 19వ వార్డు వాసవానిపాలెనికి చెందిన 1200 మందికి పైగా మత్స్యకారులు వైఎస్సార్‌సీపీలో చేరారు. శుక్రవారం సాయంత్రం ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ సమక్షంలో వాసవానిపాలెంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ ఎంవీవీ వారికి వైఎస్సార్‌సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా రంజక పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. కుల, మతాలకు అతీతంగా ముఖ్యమంత్రి జగన్ పేద ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తున్నారంటూ వారు కొనియాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అఖండ విజయానికి పెద్ద ఎత్తున కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ 19వ వార్డు ఇన్‌చార్జి వెంకటలక్ష్మి, దాసు, గణేష్, రామారావు, గ్రామ పెద్ద కొసరాజు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్న సంక్షేమ పథకాలతో గడపగడపకు మేలు

బీచ్ రోడ్డు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో గడపగడపకు మేలు చేకూరుతోందని ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 55వ రోజు పాదయాత్ర జీవీఎంసీ 28వ వార్డులో శుక్రవారం కొనసాగింది. ఎంపీ ఎంవీవీకి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా హారతులు ఇస్తూ పూల చల్లుతూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జగనన్న తన సుదీర్ఘ పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చి రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగు నింపుతున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధిని ఏక కాలంలో చేపడుతూ దేశానికి ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలుస్తున్నారన్నారు. అటువంటి ముఖ్యమంత్రి మళ్లీ రాష్ట్రానికి అవసరమని, రాబోయే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగనన్న చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, పార్టీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.



హారతులతో ఎంపీ ఎంవీవీకి స్వాగతం పలుకుతున్న ప్రజలు

జాలరి ఎండదాలో ఎంపీ సహపంక్తి భోజనం

ఎంవీపీకాలనీ: విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ శుక్రవారం జాలరిపేటను సందర్శించారు. స్థానికంగా ఉన్న సమస్యలపై పలువురు గ్రామస్తులతో ముచ్చటించడంతో పాటు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అని ఆరా తీశారు. ఈ సందర్భంగా వాసవానిపాలెం జాలరి ఎండదాలోని పేర్ల దాసితల్లి, రాజుల ఇంట్లో గ్రామ పెద్దలు, పార్టీ శ్రేణులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

నిర్లక్ష్యంతో నా భర్తను బలిగొన్నారు

- అపోలో ఆస్పత్రి వద్ద బాధిత మహిళ ఆందోళన



అపోలో ఆవరణలో మీడియాతో మాట్లాడుతున్న బాధితులు

ఆరిలోవ: అపోలో ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా తన భర్త చనిపోయారని అతని భార్య పుష్పలత ఆరోపించారు. ఆస్పత్రి వద్ద శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. విజయనగరం జిల్లా రామభద్రాపురం మండలం ఆరికతోటకు చెందిన చెందిన ఎం.కోటేశ్వరరావు(62) పొట్టలో నీరు చేరి కడుపు నొప్పితో బాధపడేవారు. అతన్ని కుటుంబ సభ్యులు హెల్త్‌సిటీలోని అపోలోలో గత ఏడాది డిసెంబర్ 22న చేర్పించారు. వైద్యుడు ఆయనకు శస్త్రచికిత్స చేసి.. కడుపులో చేరిన నీటిని తొలగించి ఇంటికి పంపించేశారు. మరుసటి రోజే అతనికి మళ్లీ కడుపులో నొప్పి మొదలైంది. దీంతో మళ్లీ ఆస్పత్రికి ఆయన్ని తీసుకొచ్చి.. సరైన చికిత్స అందించలేదని వైద్యుడిని నిలదీశారు. దీంతో కోటేశ్వరరావును ఆస్పత్రిలో చేర్పించుకుని ఎంఐసీయూలో సుమారు రెండు నెలల పాటు వైద్యం అందించారు. అతని ఆరోగ్యం క్షీణించడంతో గత నెల 20న కోటేశ్వరరావు ప్రాణాలు విడిశారు. దీంతో కుటుంబ సభ్యులు వైద్యులను నిలదీశారు. దీనిపై తర్వాత మాట్లాడుకుందామని ఆస్పత్రి వైద్యులు నచ్చజెప్పడంతో మృతదేహాన్ని తీసుకుని సొంతూరు వెళ్లిపోయారు. తర్వాత ఈ విషయం పట్టించుకోకపోవడంతో శుక్రవారం కోటేశ్వరరావు భార్య పుష్పలత, ఆమె కుమార్తె, కుమారులు వచ్చి ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. శస్త్రచికిత్స చేసిన సమయంలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా కడుపులో రక్తం గడ్డ కట్టుకుపోయిందని, దీని వల్లే మరణించారని ఆరోపించారు. వారి తప్పు లేకపోతే రెండు నెలల పాటు డబ్బులు తీసుకోకుండా ఎలా ఆస్పత్రిలో ఉంచారని ప్రశ్నించారు. దీనిపై అపోలో సీవోవో రామచంద్రరావు వివరణ కోరగా.. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి సమస్య లేకుండా పరిష్కరిస్తామని తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి


తాటిచెట్లపాలెం: రైల్వేస్టేషన్‌లోని 7వ నంబర్ ప్లాట్‌ఫాంపై శుక్రవారం వేకువజామున గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. సుమారు 65 ఏళ్ల వయసున్న అతని ఎత్తు 5.5 అడుగులు, చామనచాయ రంగులో ఉన్నట్లు జీఆర్పీ ఎస్ఐ బాలాజీరావు తెలిపారు. అతని ఆచూకీ తెలిసిన వారు విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ పోలీసులకు గానీ, 96661 22722, 94406 27547 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ట్రయల్ రన్ పేరిట కారుతో పరార్!

ఎంవీపీ కాలనీ: కారు కొంటానని వచ్చి.. ట్రయల్ రన్ పేరుతో కారుతో సహా ఓ వ్యక్తి ఉడాయించిన ఘటనపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మద్దిలపాలెంలోని వీకే రెసిడెన్సీలో నివాసముంటున్న బుడంకాయల యశ్వంత్ సాయి ఆర్కిటెక్ట్‌గా పనిచేస్తున్నారు. తనకు 39ఎంవై4454 నంబర్ గల తార్ ఎరుపు రంగు వాహనం ఉంది. అయితే ఆ కారును అమ్మిపెట్టాల్సిందిగా ఎంవీపీ గాదిరాజు ప్యాలెస్ దరి ట్రావెల్ ఏజెన్సీకి చెందిన వినయ్ భాస్కర్ అనే వ్యక్తికి అప్పగించారు. అయితే భాస్కర్ నుంచి ట్రయల్ వేస్తానని చెప్పి గుర్తు తెలియని వ్యక్తి కారు తీసుకెళ్లి మళ్లీ తిరిగి రాలేదు. ఈ విషయాన్ని భాస్కర్ కారు ఓనర్ యశ్వంత్‌కు చెప్పకుండా దాచిపెట్టాడు. కొద్దిరోజులుగా తన కారు ఎక్కడుందని యశ్వంత్.. భాస్కర్‌ను అడుగుతున్నా సమాధానం దాటవేస్తున్నాడు. దీంతో అనుమానం వచ్చి ఒత్తిడి చేయడంతో ట్రయల్ వేస్తానని చెప్పి గుర్తుతెలియని వ్యక్తి అపహరించాడని ఇటీవల చెప్పాడు. ఈ నేపథ్యంలో తన కారును దొంగలించారంటూ ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏయూ సమాచారం

జ్ఞానాన్ని నిరంతరం మెరుగుపరుచుకోవాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ నరసింహారావు

ఏయూ క్యాంపస్: జ్ఞానాన్ని నిరంతరం మెరుగుపరుచుకోవాలి ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు సూచించారు. గాంధీ అధ్యయన కేంద్రం, కృష్ణా ఐవీఎఫ్ కేంద్రం సంయుక్తంగా నిర్వహిస్తున్న రెండు నెలల సర్టిఫికెట్ కోర్సు స్త్రీ నుంచి తల్లిగా ప్రయాణం-గాంధేయ దృక్పథం శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మహిళా సాధికారతకు ఆంధ్ర విశ్వవిద్యాలయం నిరంతరం పని చేస్తోందన్నారు. కృష్ణా ఐవీఎఫ్ క్లినిక్ డైరెక్టర్ డాక్టర్ జి.ఎ.రామరాజు మాట్లాడుతూ మహిళలకు సాధికారత కల్పించడంతో పాటు మాతృత్వ భావనను అర్థం చేసుకోవడం ఈ కోర్సు లక్ష్యమన్నారు. కామాఖ్యామృత మిషన్‌కు చెందిన వేణు శ్యామ మాట్లాడుతూ మంచి సమాజాన్ని తీర్చిదిద్దడంలో తల్లి పాత్ర అపారమన్నారు. ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ మాట్లాడుతూ మహిళల సామర్థ్యాలకు పెద్దపీట వేయాలన్నారు. గాంధీ అధ్యయన కేంద్రం సంచాలకురాలు ఆచార్య కె.సీతామాణిక్యం మాట్లాడుతూ తమ కేంద్రం నిర్వహిస్తున్న కోర్సులకు వర్సిటీ అధికారుల సహకారం అనిర్వచనీయమన్నారు. డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్ రచించిన కోర్సు మెటీరియల్‌ని ఆచార్య నరసింహారావు, డాక్టర్ జి.ఎ.రామరాజు ఆవిష్కరించారు.

హెల్త్ సిటీ రోడ్లలో పచ్చదనానికి చర్యలు

ఆరిలోవ: జీవీఎంసీ అధికారులు హెల్త్‌సిటీ రోడ్లను శుభ్రం చేయిస్తున్నారు. చెత్త దిబ్బలను తొలగించి, చదును చేసి, పచ్చదనం కోసం చర్యలు చేపట్టారు. హెల్త్‌సిటీలో ప్రధాన రహదారి సుమారు 700 మీటర్ల పొడవున ఆరిలోవ కాలనీ రోడ్డుకు కనెక్టై ఉంది. కొందరు ఇరువైపులా రోడ్డుపై లారీలతో డెబ్రిస్ తీసుకొచ్చి వేసేశారు. ఇటీవల జీవీఎంసీ కమిషనర్ ఈ ప్రాంతంలో పర్యటించి ఇక్కడ రోడ్డు పక్కన గోడ నిర్మించి పచ్చదనం పెంపకానికి ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో సుమారు రూ.70 లక్షల నిధులతో ఈ రోడ్డుకు ఇరువైపులా శుభ్రం చేసి గోడ నిర్మాణానికి సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా శుక్రవారం జీవీఎంసీ వర్క్స్ అధికారులు ఇక్కడ పనులు ప్రారంభించారు. జేసీబీతో పిచ్చి మొక్కలను తొలగించి డెబ్రిస్‌ను చదును చేయిస్తున్నారు. అనంతరం పచ్చదనం కోసం గ్రీన్ లేన్లు(గడ్డి) అమర్చనున్నారు. పశువులు, లారీలు ప్రవేశించడానికి వీలు లేకుండా గ్రీనరీకి, రోడ్డుకు మధ్యలో రక్షణ గోడ నిర్మించనున్నారు. కొద్ది రోజుల్లో ఈ రోడ్డు పచ్చదనంతో కనువిందు చేయనుంది.



హెల్త్‌సిటీ రోడ్లలో చెత్త దిబ్బలను జేసీబీతో చదును చేయిస్తున్న జీవీఎంసీ ఇంజినీరింగ్ సిబ్బంది